

‘నా మరణాన్ని కొన్ని క్షణాలు
వాయిదా వెయ్యి దేవుడా! లేదంటే
అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.
దయచేసి నాకు కాస్త ఆరోగ్యాన్నివ్వు’ అని
ఆక్రోశించాడు వయోవృద్ధుడు ప్రకాష్ సింగ్ .
ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న ఆయన
తన వద్దకు ఎవరైనా వస్తే బాగుండునని
చూస్తున్నాడు. ఐసీయూ తలుపు దగ్గర నర్సుతో
మాట్లాడుతున్న తన డ్రైవరు కనబడ్డాడాయనకు.

**ఆ తర్వాతేం జరిగింది? ప్రకాష్ సింగ్
మృత్యువును తప్పించుకుని
అమాయకుల ప్రాణాలను కాపాడగలిగాడా?**

ఆద్యంతం ఉత్కంఠగా చదివించే

**పుట్టగంటి గోపీకృష్ణ**

# దేవుడితో పంతం!

ఈ నెల చతుర కానుక!

పుట్టగంటి గోపీకృష్ణ

# దేవుడితో పంతం!



జీవం అనేక రూపాల్లో ఉంటుంది. గాలిలో ఎగిరే పక్షులూ... నీటిలో ఈదే చేపలూ... నేల మీద నడిచే జంతువులూ.. కీటకాలు, పురుగులు, పాములు, మొక్కలు, చెట్లు, లతలు, అంతేనా?

అన్నిటినీ మించి మనిషి.. అన్ని జీవులూ ఒకదానిపై మరొకటి ఆధారపడ్డవే. పులికి మేక కావాలి. పిట్టకి పురుగు కావాలి. పాముకి ఎలుక కావాలి. పక్షికి పాము కావాలి. మరి మనిషికి అన్నీ కావాలి.

సృష్టిలో ఏ జీవీ వృథా కాదు. అన్నీ అవసరమే! ఒకదాని మీద మరొకటి ఆధారపడ్డవే! అదే జీవ వైవిధ్యం.

అలాగే... జీవనం కూడా అనేక రూపాల్లో ఉంటుంది.

సంపాదించి తెచ్చే పురుషులు.

ముక్కు మూసుకుని జపించే రుషులు.

హలాన్ని భుజాన వేసుకునే హాలికులు.

ఉదయాన్నే గొంతు సవరించుకునే వైతాళికులు.

ఇంటిని చక్కదిద్దే ఇంతులు.

పురుషులతో పోటీ పడే పడతులు.

తాతలు, తండ్రులు, అన్నలు, బావలు, అమ్మలు, అత్తలు, అక్కలు, పిల్లలు, కూరగాయలమ్మే కాశీపతీ, పాలు తెచ్చి పోసే పకీరయ్యా, ఇంట్లో పనిచేసే రత్తాలు, వీధులు ఊడ్చే రజియా, లారీ డ్రైవరు, విమానం పైలెట్, బిళ్ళ బంట్రోతు, బడా వ్యాపారి.. అందరూ అవసరమే! అందరూ కలిస్తేనే జీవన ప్రవంతి. ఒకరు ఎక్కువా కాదు, మరొకరు తక్కువా కాదు. అదే జీవన వైవిధ్యం.

★ ★ ★

సైరన్ మోగించుకుంటూ వచ్చి, విశాలమయిన భవనం ముందు కారు ఆగింది. అందులో నుండి దిగిన కేంద్ర మంత్రి సిసోడియా ఒకసారి చుట్టూ పరిశీలించి చూశాడు.

రంగురంగుల విద్యుత్ కాంతుల మధ్య, దసరా సందర్భంగా అలంకరించిన మైసూర్ ప్యాలెస్‌లా మెరిసిపోతోంది ఆ భవనం.

దేశ రాజధాని ఢిల్లీలోని సంపన్నులు నివసించే పోష్ లొకాలిటీ అది. విశాలంగా విస్తరించిన గార్డెన్ మధ్య ఉంది ఆ అందమయిన భవనం. దానికి ఆనుకుని ఉన్న ఈత కొలను చుట్టూ రౌండ్ టేబుల్స్ వేసి ఉన్నాయి. అప్పటికే సగం పైగా కుర్చీలు అతిథులతో నిండిపోయి కళకళలాడుతున్నాయి.

ఈ సంరంభానికంతా కారకుడు ప్రకాష్ సింగ్. ఈ రోజు ఆయన తొంభయ్యో పుట్టినరోజు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ అది. ముందు సిసోడియా ఆ పార్టీకి రావాలని అనుకోలేదు. ప్రధాన మంత్రి స్వయంగా పిలిచి, తనకు పార్టీకి వెళ్ళటం వీలు కావటం లేదనీ, కాబట్టి తన తరపున వెళ్ళి రమ్మనీ చెప్పటంతో వచ్చాడు సిసోడియా.

పరిసరాలను గమనించటం ముగించి అతను వడివడిగా ముందుకు కదిలాడు.

ప్రకాష్ సింగ్ కొడుకు స్వదేష్ సింగ్ అతిథులను ఆహ్వానించే కార్యక్రమంలో హడావుడిగా ఉన్నాడు. అతను గబగబా ముందుకు వచ్చి సిసోడియాని సాదరంగా ఆహ్వానించి అతన్ని ఒక వ్యక్తికి అప్పచెప్పి లోపలకు పంపాడు.

చాలా తక్కువమంది అతిథులను మాత్రమే ఆ ఫంక్షన్‌కు పిలిచారు. దాదాపు అతిథికి ఒకవ్యక్తి చొప్పున ఏర్పాటు చేసిన మనుషులు వచ్చినవారి అవసరాలు చూడటానికి హడావుడి పడుతున్నారు.

కొడుకులు, కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మునిమనవలతో ప్రకాష్ సింగ్

కుటుంబం చాలా పెద్దదిగా ఉంది- ఆయన నివసిస్తున్న భవనంలానే.

పి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ప్రకాష్ సింగ్ స్థాపించిన కంపెనీ దేశంలోనే అతి పెద్ద నిర్మాణ రంగ సంస్థ.

ఇప్పుడు పి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్‌తో పోటీపడే కంపెనీలు దేశంలో మరికొన్ని కూడా ఉండవచ్చు. కానీ ప్రకాష్ సింగ్ ఈ కంపెనీ స్థాపించిన తొలి రోజుల్లో అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నాడు. ఎన్ని అడ్డంకులు ఎదురయినా దేశ నిర్మాణంలో పాలు పంచుకోవాలన్న తపనతో తన కంపెనీని నడిపాడు. అందుకే ఆయనంటే అందరికీ ఎంతో గౌరవం.

దేశంలో ఏ మూల ఏ పెద్ద ప్రాజెక్ట్ కడుతున్నా దానిలో పి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ పాత్ర ఉంటుంది. హైడల్ పవర్ ప్రాజెక్టు దగ్గర నుండి మెట్రోరైలు ప్రాజెక్టుల వరకు, ఎక్స్‌ప్రెస్ హైవేల దగ్గర నుండి యూనివర్సిటీ భవనాల వరకూ ఆ కంపెనీ చేపట్టని ప్రాజెక్ట్ లేదు. ప్రకాష్ సింగ్ అప్పుడప్పుడూ గర్వంగా చెప్తుంటాడు- 'ఈ దేశ నిర్మాణంలో పాలు పంచుకున్నాం.. అని చెప్పుకునే అవకాశం కేవలం మా కంపెనీకి ఒక్కదానికే ఉంది!' అని.

సింహాసనం మీద కూర్చున్న రారాజులా ప్రకాష్ సింగ్ విడిగా ఒక కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

వస్తున్న అతిథులు ఒకరొకరుగా ఆయన్ని పలుకరించి కాసేపు మాట్లాడి వెళ్తున్నారు. వయసు ప్రభావంతో శరీరమంతా క్షీణించగా, ముడుతలు పడిన చర్మంతో, వేసుకున్న కోటులో ఒదిగిపోయి, పిట్టలాంటి ఆకారంతో కూర్చుని ఉన్నాడు ప్రకాష్ సింగ్.

మిగిలిన శరీరమంతా వృద్ధాప్యాన్ని సూచిస్తుంటే ఆయన కళ్ళు మాత్రం మెదడులోని చురుకుదనాన్ని ప్రతిఫలిస్తు

న్నాయి.

సిసోడియా నెమ్మదిగా దారి చేసుకుని ఆయన దగ్గరకు చేరుకుని తన చేతిలోని పుష్పగుచ్ఛాన్ని ఆయనకు అందించాడు. దానిని అందుకుంటున్న ప్రకాష్ సింగ్‌తో, "హ్యాపీ బర్త్‌డే సర్!" అన్నాడు.

నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పిన ప్రకాష్ సింగ్ తన పక్కన ఉన్న సోఫాలో సిసోడియాని కూర్చోపెట్టుకున్నాడు.

"ప్రధానమంత్రిగారు ముఖ్యమైన పనిలో ఉండటం వలన రాలేకపోయారు. నాకు మరీమరీ చెప్పారు- మీకు తమ శుభాకాంక్షలు చెప్పమని" అన్నాడు సిసోడియా.

"అలాగే నా కృతజ్ఞతలు కూడా వారికి తెలుపండి" నవ్వుతూ అన్నాడు ప్రకాష్ సింగ్.

ప్రకాష్ సింగ్ ఈ దేశంలో పుట్టిన గొప్ప మేధావుల్లో ఒకడు. ఎంత వృద్ధుడయినా ఆయన శరీరం బలహీనపడిందేమో కానీ, మేధస్సు మాత్రం ఇంకా చురుగ్గానే ఉంది.

"ఇంతకుముందు పుట్టినరోజుని ఓ పండుగలా చేసుకోవటానికి నేను ఇష్టపడే వాడిని కాదు. ఎందుకంటే 'పుట్టటంలో ఏం గొప్ప ఉందని సెలబ్రేట్ చేసుకోవాలి? ఏం సాధించామని వేడుకలు చేసుకోవాలి?' అనుకునేవాడిని. కానీ ఈసారి అలా అనిపించలేదు" స్వగతంలా లోగొంతుకతో అన్నాడు ప్రకాష్ సింగ్.

"అభ్యంతరం లేకపోతే అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటో తెలుసుకోవచ్చా?" కుతూహలంగా అడిగాడు సిసోడియా.

"ఇప్పుడు తరువాతి పుట్టినరోజు వరకు బతకటమే ఒక గొప్ప విజయం అనిపిస్తోంది. అందుకే ఈసారి ఈ బిగ్‌బాష్‌కి నేను అభ్యంతరం చెప్పలేదు"

నవ్విన సిసోడియా "మీకొక రహస్యం చెప్పనా? మీ పేరు పద్మభూషణ్ అవార్డు కోసం రికమెండ్ చేశాం" అన్నాడు.

ఆ చెప్పటంలో అతని స్వరంలో కించిత్ గర్వం తొణికిసలాడింది.

ఆ విషయం గమనించనట్లు ప్రకాష్ సింగ్ మాత్రం తన స్వరంలో నమ్రతను వీడకుండా సమాధానమిచ్చాడు- "ధన్యుడ్ని! మీరు ఇచ్చేవారు.. నేను తీసుకునేవాడ్ని. ప్రభుత్వం ఏ గౌరవం ఇచ్చినా అది నా దేశం నాకు చేస్తున్న సత్కారం అనుకుంటాను. అయినా ఇంతకుముందు ఇచ్చిన పద్మశ్రీ అవార్డే నా తాహతుకు ఎక్కువని నా అభిప్రాయం"

తన తప్పును సరిదిద్దుకుంటూ "అయ్యో! అదేం మాటండి! మీకెన్ని అవార్డులు ఇచ్చినా దేశానికి మీరు చేసిన సేవకు అవి సరితూగలేవు" అన్నాడు సిసోడియా.

మరికాసేపు సంభాషణ నడిచిన తరువాత సిసోడియాకి ఆయన్ని ఒక విషయం అడగాలని అనిపించింది. దాంతో "నేనొక విషయం అడుగుతాను. ఏమీ అనుకోరుగా? " అన్నాడు.

"అడగండి.." చిరునవ్వుతో అన్నాడు ప్రకాష్ సింగ్.

"ఇంత సుదీర్ఘ జీవితంలో మీకు అసంతృప్తులు ఏమైనా ఉన్నాయా? " అడిగాడు సిసోడియా. అడిగిన తరువాత అతనికి అనిపించింది 'అనవసరంగా ఎక్కువ చనువు తీసుకుంటున్నానా? ' అని. కానీ ఆయన మొహం మీద చిరునవ్వు చెరగకపోవటం చూసి ధైర్యం వచ్చింది.

"నాకు తృప్తి దొరికిందెక్కడ? జీవితమంతా అసంతృప్తిగానే గడిచిపోయింది. ఇంత సాధించాను.. అని అనుకోబుద్ధి కాదు. ఇంకా సాధించవలసింది ఎంతో ఉందనిపిస్తోంది"

"ఇంత ఎదిగిన మీకే తృప్తి లేదంటే..."

"నా దృష్టిలో తృప్తి అనేమాట మరణానికి పర్యాయపదం. మనిషి బతికి ఉన్నం